క్లుప్తంగా

చిత్రపురికి బస్సు సౌకర్యం



బస్సుకు పూజలు చేస్తున్న నాయకులు

మణికొండ: చిత్ర పరిశ్రమ కార్మికులకు సౌకర్యంగా ఉండేలా చిత్రపురి కాలనీ నుంచి ఫిల్మ్‌నగర్ మీదుగా సికింద్రాబాద్ వరకు నడపనున్న బస్సును సోమవారం చిత్రపురి హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడు వి. అనిల్‌కుమార్, మణికొండ మున్సిపాలిటీ బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ కె.రామకృష్ణారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సినీ పరిశ్రమలో పనిచేసే కార్మికులు చిత్రపురి కాలనీలో నివాసం ఉంటున్నారన్నారు. వారు ఫిల్మ్‌నగర్, ఇందిరానగర్, అమీర్‌పేట్ ప్రాంతాల్లో జరిగే షూటింగ్‌లకు వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ నేపథ్యంలో వారికి సౌకర్యంగా అదే రూటులో బస్సు సర్వీసును ఏర్పాటు చేసినందుకు కంటోన్మెంట్ డిపో మేనేజర్ రాంమోహన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

పండుగలు ప్రశాంతంగా జరుపుకోవాలి

గోల్కొండ: పండుగలు ప్రశాంతంగా జరుపుకోవాలని గోల్కొండ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. హోలీ, షబ్-ఏ-మేరాజ్ పండుగను పురస్కరించుకుని సోమవారం గోల్కొండలో పీస్‌అండ్ మైత్రి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శాంతిభద్రత పరిరక్షణలో పీస్‌అండ్ మైత్రి కమిటీ సభ్యులు దశాబ్దాలుగా పోలీసులకు సహాయ సాకారాలు అందిస్తున్నారని ఆయన అన్నారు. మైత్రి కమిటీ సభ్యులు సివిల్ దుస్తుల్లో పోలీసులు లాంటివారని, వారి వల్లే తాము స్థానికంగా సమస్యలను ఎక్కడికక్కడే పరిష్కరించగల్గుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పీస్ కమిటీ సభ్యులు అబెద్ భాయ్, ఆజమ్ ఖాన్, పూస వేణుగోపాల్, షానవాజ్ ఖాన్ తదితరులున్నారు.

ఇన్‌ఫెక్షన్ సోకకుండా ప్రత్యేక చర్యలు

గోల్కొండ: గోల్కొండ ఏరియా ఆస్పత్రిలో ఇన్‌ఫెక్షన్ సోకకుండా చేపట్టాల్సిన చర్యలపై హాస్పిటల్ ఇన్‌ఫెక్షన్ కంట్రోల్ కమిటీ సమావేశం సోమవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ప్రాజెక్ట్ ఆఫీసర్ ఆర్య ఎస్. నాయర్ ముఖ్య వక్తగా హాజరై మాట్లాడారు. పలు ప్రభుత్వ ఆస్పత్రుల్లో సిబ్బంది, ఆస్పత్రికి వచ్చే రోగులు, వారి సహాయకుల కారణంగా ఇన్‌ఫెక్షన్ సోకే ప్రమాదం ఉందన్నారు. ఆస్పత్రి కింది స్థాయి సిబ్బంది నుంచి నర్సింగ్ స్టాఫ్, వైద్యులు ఎవ్వరి విధులు వారు సక్రమంగా నిర్వహిస్తే ఇన్‌ఫెక్షన్ సోకే అవకాశాలు తగ్గుతాయని అన్నారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మజహర్ ఉల్లా మాట్లాడుతూ.. ఆస్పత్రిలో అందరూ క్రమశిక్షణతో విధులు నిర్వహిస్తే ఇన్‌ఫెక్షన్‌ను పూర్తిగా నివారించవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏట డాక్టర శ్రీనివాసరావు, డాక్టర్ గోపాల్, డాక్టర్ కవితతో పాటు నర్సింగ్ స్టాఫ్, వైద్యులు పాల్గొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌ను విజయవంతం చేయాలి

చాంద్రాయణగుట్ట: స్వచ్ఛ సర్వేక్షణ్-2023 కార్యక్రమాన్ని అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో విజయవంతం చేయాలని జీహెచ్ఎంసీ చార్మినార్ జోన్ జోనల్ కమిషనర్ సామ్రాట్ అశోక్ ఆదేశించారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌పై చాంద్రాయణగుట్టలోని గ్రేస్ ఫంక్షన్‌హాల్‌లో సోమవారం అధికారులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు స్థానిక ఓపెన్ పాయింట్లలో చెత్తను వేయకుండా ఇంటి వద్దకు వచ్చే ఆటో టిప్పర్ సిబ్బందికి తడి, పొడి చెత్తను వేర్వేరుగా ఇవ్వాలన్నారు. నాలాలు, చెరువులు, కుంటలలో చెత్త వేయకుండా చూడాలన్నారు. పబ్లిక్ టాయిలెట్ల నిర్వహణ, 120 మైక్రాన్ల కంటే తక్కువ మందం కలిగిన ప్లాస్టిక్ నిషేధమన్నారు. రోడ్లపై చెత్త వేయకుండా పర్యవేక్షించాలన్నారు. బస్తీ దవాఖానాలు, అన్నపూర్ణ కేంద్రాలు పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలన్నారు. ప్రతిఒక్కరూ తమ తమ బాధ్యతలు అంకితభావంతో నిర్వర్తించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కమిషనర్ శైలజ, డీసీలు జయంత్, అలివేలు మంగతాయారు, రిచా గుప్తా, సూర్యకుమార్, రాజేందర్ రెడ్డి, జగన్ తదితరులు పాల్గొన్నారు.

దశల వారీగా సమస్యల పరిష్కారం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ నియోజకవర్గంలో రూ. కోట్లు వెచ్చించి అభివృద్ధి పనులను చేపడుతూ ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్లు రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ అన్నారు. సోమవారం ఆయన ప్రేమావతిపేటలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. ప్రధానంగా డ్రైనేజీ, మంచినీరు, రోడ్లు, పారిశుద్ధ్యం, విద్యుత్ తదితర సమస్యలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు ఆయా ప్రాంతాల ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దశల వారీగా నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. సమస్యల ప్రాధాన్యతకు అనుగుణంగా వాటికి శాశ్వత పరిష్కారాలు చూపిస్తున్నామన్నారు. ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయంగా పని చేస్తున్నట్లు తెలిపారు. ప్రజలు ఎక్కడ ఎలాంటి సమస్య ఉన్నా నేరుగా తన దృష్టికి తీసుకురావాలన్నారు. వాటిని పరిష్కరించేందుకు తాను ఎల్లప్పుడు సిద్ధంగా ఉంటానన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అన్ని వర్గాల అభివృద్ధే ముఖ్యమంత్రి కేసీఆర్ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు



విద్యార్థులకు డ్యూయల్ డెస్క్ టేబుళ్లను అందించిన సంస్థల ప్రతినిధులు

మణికొండ: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు సౌకర్యాలు కల్పించేందుకు తమ వంతు కృషి చేస్తున్నామని సికింద్రాబాద్ రౌండ్ టేబుల్ ఇండియా చైర్మన్ సుమన్ వేమూరి అన్నారు. సోమవారం ఆయన నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని వట్టినాగులపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు అవసరమైన 50 డ్యూయల్ డెస్క్ టేబుళ్లను అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నేటి విద్యార్థులే రేపటి పౌరులని, విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు ఎదగాలన్నారు. లేడీస్ సర్కిల్ ఇండియా జాతీయ కార్యదర్శి శిషమ్ సబర్వాల్ మాట్లాడుతూ పాఠశాలలో గడిపిన సమయమే మన జీవితంలో ఎదిగేందుకు పునాది వేస్తుందన్నారు. కార్యక్రమంలో మమత, భావన, ప్రధానోపాధ్యాయురాలు రేణుకాదేవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా కామదహనం



మణికొండలో కామదహనంలో పాల్గొన్న నాయకులు

మణికొండ: హోలి పండగకు ముందు నిర్వహించే కామదహనాన్ని మణికొండ , నార్సింగి మున్సిపాలిటీల పరిధిలోని పలు గ్రామాల్లో ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. గ్రామాల్లోని ప్రధాన కూడళ్లలో కట్టెలు, పిడకలను పేర్చి వాటికి ప్రత్యేక పూజలు నిర్వహించి దహనం చేశారు. హోలీ పండగను మంగళవారం నిర్వహించేందుకు ప్రజలంతా సిద్ధమవుతున్నారు. ప్రజలు పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని, ఎవరిపైనా బలవంతంగా రంగులను చల్లవద్దని పోలీసులు సూచించారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

శంషాబాద్ రూరల్: మండల పరిధిలోని హమీదుల్లానగర్, పెద్దషాపూర్‌కు చెందిన పలువురికి మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను సోమవారం ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ పంపిణీ చేశారు. వెంకటేష్ యాదవ్, శ్రీకాంత్ యాదవ్, రమణారెడ్డి, కె.రవీందర్‌కు రూ.2,39,000 విలువైన చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సతీష్‌యాదవ్, నాయకులు మోహన్‌రావు, శ్రీనివాస్, అశోక్‌యాదవ్, కె.నర్సింహ, ధనపాల్ రెడ్డి, సంతోష్, ప్రభాకర్, రవి, బాల్‌రాజ్, లక్ష్మారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్

బిల్లులపై ఉన్న శ్రద్ధ నీటి సరఫరాపై లేదా?



సాయినగర్‌లో పర్యటిస్తున్న కార్పొరేటర్ సంగీత

రాజేంద్రనగర్: ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం నీటి బిల్లులను వసూలు చేయడంలో చూపుతున్న శ్రద్ధ మంచి నీటిని సరఫరా చేయడంలో చూపడం లేదని అత్తాపూర్ డివిజన్ కార్పొరేటర్ మోండ్ర సంగీత గౌరీశంకర్ అన్నారు. సోమవారం ఆమె డివిజన్ పరిధిలో పలు ప్రాంతాల్లో పర్యటించారు. సాయినగర్ కాలనీలో గత కొన్ని రోజులుగా మంచినీటిలో డ్రైనేజీ కలుస్తుండటంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నల్లా నీటిని పరిశీలించిన ఆమె వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముక్కు పిండి బిల్లులు వసూలు చేస్తున్న పాలకులు శుద్ధమైన మంచినీటిని అందించడంలో పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించారు. ఆదాయాన్ని పెంచుకునేందుకు ఎక్కడపడితే అక్కడ మద్యం షాపులు ఏర్పాటు చేస్తున్నారన్నారు. మౌలిక సదుపాయాలపై శ్రద్ధ చూపడం లేదని ఆరోపించారు. అసలే ఎండాకాలం కలుషిత నీటిని తాగి ప్రజలు రోగాల బారిన పడుతున్నారన్నారు. కొత్త మంచినీటి పైపులైన్ ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించాలని జలమండలి అధికారులను కోరారు. కార్యక్రమంలో డివిజన్ బీజేపీ ఉపాధ్యక్షులు ఉమాబాయి, కాంచన, జోషి, తదితరులు పాల్గొన్నారు.

రూ.2 కోట్లతో మోడల్ ధోబీఘాట్



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న మునిసిపల్ చైర్‌పర్సన్ సుష్మ తదితరులు

శంషాబాద్ రూరల్: శంషాబాద్ మునిసిపాలిటీ పరిధిలో రూ.2 కోట్లతో మోడల్ ధోబీఘాట్ ఏర్పాటు చేయనున్నట్లు మునిసిపల్ చైర్‌పర్సన్ సుష్మ తెలిపారు. సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ రజకుల అభివృద్ధి కోసం ఆధునిక హంగులతో దోబీఘాట్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయించినందుకు ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌కు కృతజ్ఞతలు తెలుపుతూ ఎమ్మెల్యేను సన్మానించారు. కార్యక్రమంలో నార్సింగి మార్కెట్ కమిటీ చైర్మన్ డి.వెంకటేష్‌గౌడ్, కౌన్సిలర్ కుమార్, కో-ఆప్షన్ సభ్యులు సంతోష, బీఆర్ఎస్ నాయకులు గణేష్‌గుప్తా, తాజ్‌బాబా, కె.శ్రీనివాస్, మురళి, రజకసంఘం నాయకులు పాల్గొన్నారు.

హోలీ సందర్భంగా భారీ బందోబస్తు



హైదర్‌గూడలో కామ దహనం నిర్వహిస్తున్న బస్తీ వాసులు

రాజేంద్రనగర్: హోలీ పండుగను పురస్కరించుకుని మైలార్‌దేవ్‌పల్లి, రాజేంద్రనగర్, అత్తాపూర్ పోలీస్ స్టేషన్ల పరిధిలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో రాజేంద్రనగర్ డీసీపీ జగదీశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీస్ స్టేషన్ల వారీగా పీస్ కమిటీ సమావేశాలు నిర్వహించారు. కాముడి దహనం నేపథ్యంలో సోమవారం పోలీసులు పలు ప్రాంతాల్లో పికెట్‌లు ఏర్పాటు చేశారు.

సందడిగా కాముని దహనం

రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని పలు బస్తీలు, కాలనీల్లో సోమవారం రాత్రి కాముని దహనం నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లో కట్టెలు, పిడకలు, ఎండిన చెట్టుకొమ్మలను కాముడిని పేర్చి దహనం చేశారు. ఈ సందర్భంగా ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ హోలీ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అత్తాపూర్, రాంబాగ్ ప్రాంతాల్లో ఆదివారం రాత్రి కామ దహన కార్యక్రమాలు నిర్వహించగా, సర్కిల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో సోమవారం కామ దహన కార్యక్రమాలు చేపట్టారు. మంగళవారం హోలీ వేడుకలు నిర్వహించనున్నట్లు బస్తీ, యువజన కమిటీ సభ్యులు తెలిపారు.



కామదహనంలో పాల్గొన్న మున్సిపల్ వైస్ చైర్మన్ వెంకటేశ్‌యాదవ్

రోడ్లపై హోలీ ఆడొద్దు

హోలీ పండుగ నేపథ్యంలో రాజేంద్రనగర్ జోన్ డీసీపీ జగదీశ్వర్‌రెడ్డి ప్రజలకు పలు సూచనలు చేశారు. ప్రార్థన మందిరాలు, రోడ్లపై హోలీ ఆడరాదన్నారు. రోడ్లపై రంగులు చల్లుకోవడం వల్ల పాదచారులు, వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటారన్నారు. ప్రార్థన మందిరాల వద్ద రంగులు చల్లుకుని ఇతరులకు ఇబ్బంది కలిగించరాదని సూచించారు. శాంతియుత వాతావరణంలో హోలీ వేడుకలు జరుపుకోవాలన్నారు. ద్విచక్ర వాహనాలపై తిరుగుతూ రంగులు వెదజల్లితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నార్సింగిలో..

మణికొండ: నార్సింగి మున్సిపాలిటీ కేంద్రంలో సోమవారం రాత్రి కామదహనం నిర్వహించారు. హోలీ పండగ విషయంలో ఈ సంవత్సరం గందరగోళం నెలకొనడంతో కొన్ని గ్రామాల్లో ఆదివారం రాత్రి, మరికొన్ని గ్రామాల్లో సోమవారం కామదహనాలను నిర్వహించారు. నార్సింగి మున్సిపాలిటీ కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జి. వెంకటేశ్‌యాదవ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ఉషారాణి, నాయకులు రాజ్‌కుమార్, గ్రామస్తులు పాల్గొన్నారు.

అనుమతులు లేని పనులు ఆపండి

మణికొండ: ఎలాంటి అనుమతులు లేకుండా ప్రధాన రోడ్డు పక్కనే సెల్లార్ తవ్వకాలు జరుపుతున్నారని, పనులను వెంటనే నిలిపివేయాలని స్థానికులు మునిసిపల్ అధికారులకు ఫిర్యాదు చేశారు. మణికొండ మునిసిపాలిటీ పరిధిలోని పుప్పాలగూడ గ్రామ సర్వేనెంబర్ 176లోని 346 గజాల ప్లాటులో ఎలాంటి అనుమతులు లేకుండా గత రెండు రోజులుగా సెల్లార్ తవ్వకాలు చేపడుతున్నారన్నారు. ఈ విషయమై స్థానిక టౌన్‌ప్లానింగ్ అధికారిని వివరణ కోరగా నిర్వాహకులకు ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని పేర్కొన్నారన్నారు. సదరు పనులను నిలిపివేయాలని కోరగా పట్టించుకోవటం లేదని అలకాపూరి కాలనీ వాసులు ఆరోపిస్తున్నారు. కమిషనర్ ఈ విషయంలో జోక్యం చేసుకుని పనులను నిలిపివేయించాలని కోరినట్లు తెలిపారు.

మహిళలపై దాడులకు అడ్డుకట్టవేయాలి

రాజేంద్రనగర్: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న దాడులను నియంత్రించడంలో రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాన్ని నిరసిస్తూ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్‌కుమార్ ఆధ్వర్యంలో బీజేపీ రాష్ట్ర కార్యాలయం వద్ద నిరాహార దీక్ష చేపట్టారు. కార్యక్రమంలో కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు. అనంతరం సాయంత్రం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో మహిళలపై దాడులు నానాటికి పెరుగుతున్నాయన్నారు. వీటిని అరికట్టడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమవుతుందన్నారు. బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వానికి త్వరలోనే ప్రజలు తగిన గుణపాఠం చెబుతారన్నారు. కార్యక్రమంలో డివిజన్ బీజేపీ అధ్యక్షులు అడికే జనార్దన్, టి.సుధాకర్‌రెడ్డి, జోగి రవి, రావుల భాస్కర్, ఎన్ను శ్రీనివాస్‌రెడ్డి, సంతుగౌడ్, శ్రీకాంత్ రెడ్డి, పాండుయాదవ్, శరణమ్మ, వి.లక్ష్మి, నాగమణి, తిరుపతమ్మ, మజహర్, సి.హెచ్.ప్రభుదాస్, డి.శ్రీనివాస్‌రెడ్డి, రమేష్, శ్రీధర్ పాల్గొన్నారు.

యువకుడి అనుమానాస్పద మృతి



మృతదేహం వద్ద రోధిస్తున్న బంధువులు

మణికొండ: ఓ నిర్మాణ సంస్థ చేపడుతున్న సెల్లార్ తవ్వకాల్లో ఓ యువకుడు అనుమానాస్పదంగా మృతి చెందిన సంఘటన నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలోని అలకాపూరి టౌన్‌షిప్‌లో సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు, మృతుని బంధువుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. అలకాపూరి టౌన్‌షిప్‌లో ఆర్ఆర్ బిల్డర్స్ షాపింగ్ మాల్ నిర్మాణ పనులు చేపట్టింది. సెల్లార్ పనుల్లో భాగంగా చందానగర్‌కు చెందిన ప్రశాంత్(26) ట్రాక్టర్‌తో క్రషింగ్ చేస్తున్నాడు. అయితే అతని తలకు గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ట్రాక్టర్ బోల్తాపడి ప్రశాంత్ మృతి చెందాడని నిర్వాహకులు చెబుతున్నారు. సంఘటనా స్థలానికి చేరుకున్న మృతుని బంధువులు చదునుగా ఉన్న స్థలంలో ట్రాక్టర్ ఎలా బోల్తా పడుతుందని ప్రశ్నిస్తున్నారు. జేసీబీ తగిలి అతడికి గాయాలయ్యాయని, ఈ విషయాన్ని దాచిపెట్టేందుకు ట్రాక్టర్ బోల్తాపడిందని చెబుతున్నారని ఆరోపిస్తూ ఆందోళనకు దిగారు. సమాచారం అందడంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులపై మృతుని బంధువులు రాళ్లతో దాడి చేశారు. కాంట్రాక్టర్ వచ్చి మృతుని కుటుంబానికి న్యాయం చేసే వరకు మృతదేహాన్ని అక్కడి నుంచి తరలించేది లేదని భీష్మించుకున్నారు. పోలీసులు వారికి నచ్చజెప్పి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి

గోల్కొండ: రాష్ట్రంలో వచ్చే ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని రాష్ట్ర ఓబీసీ మోర్చా నాయకుడు ఆలె భాస్కర్ అన్నారు. షేక్‌పేట్‌కు చెందిన ఓబీసీ మోర్చా నాయకుడు సత్తిరాజ్ ముదిరాజ్ సోమవారం ఆలె భాస్కర్‌ను కలిశారు. కార్యకర్తలంతా సమష్టిగా తమ తమ ప్రాంతాల్లో బీజేపీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు.

జీవన ఎరువుల ప్రాముఖ్యతపై రైతులకు శిక్షణ



శిక్షణకు హాజరైన రైతులు

ఏజీవర్సిటీ: రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో వ్యవసాయంలో జీవన ఎరువుల ప్రాముఖ్యత, రైతులకు కలిగే లాభాలు, జీవన ఎరువుల తయారీ తదితర అంశాలపై రైతులకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. శిక్షణలో మోయినాబాద్, అమ్మాపూర్ గ్రామాల రైతులు పాల్గొన్నారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయం అసోసియేట్ డీన్ సీ నరేంద్ర రెడ్డి, ఎస్ త్రివేణి, దామోదరాచారి, శ్రీదేవి, కేసీ దీప్తి విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధి పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

మణికొండ: మునిసిపాలిటీ పరిధిలోని మహిళా సంఘాల ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వాలు, పలు సంస్థలు అనేక పథకాలను అందజేస్తున్నాయని వాటిని సద్వినియోగం చేసుకోవాలని మణికొండ మున్సిపల్ కమిషనర్ కె.ఫల్గుణ్‌కుమార్ అన్నారు. సోమవారం మణికొండ గార్డెన్ కమ్యూనిటీ హాల్‌లో డ్వాక్రా మహిళలకు ఉపాధి పథకాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు ఎంచుకున్న రంగంలో శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలను కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో ఏపీ ప్రొడక్టివిటీ కౌన్సిల్ ప్రిన్సిపల్ డైరెక్టర్ డాక్టర్ టి. శ్రీనివాస్, ప్రతినిధులు రఘు, శ్రీధర్, నజీర్, సిద్దిక్, టీఎంసీ లక్ష్మి, ఆర్‌పీలు, మహిళలు పాల్గొన్నారు.



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న కమిషనర్, మహిళలు

శ్రీచైతన్య కళాశాలను మూసివేయాలి



ఇంటర్‌బోర్డు అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న ఎన్ఎస్‌యూఐ నాయకులు

మణికొండ: నార్సింగిలోని శ్రీచైతన్య కళాశాలలో పలువురు విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్న నేపథ్యంలో కళాశాలను శాశ్వతంగా మూసివేయాలని ఎన్ఎస్‌యూఐ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం రాష్ట్ర ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు బల్మూరి వెంకట్, జిల్లా అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర ఇంటర్మీడియట్ బోర్డు కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాజేంద్రనగర్ నియోజకవర్గ అధ్యక్షుడు డి. ప్రణయ్ మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా ప్రతి సంవత్సరం సదరు కళాశాలలో ఏటా ఒకరు ఆత్మహత్యకు పాల్పడ్డారని ఆరోపించారు.

గుర్రం చెన్నకేశవరెడ్డిని గెలిపించండి



గుర్రం చెన్నకేశవరెడ్డికి మద్దతుగా కరపత్రాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

బండ్లగూడ: ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్న గుర్రం చెన్నకేశవరెడ్డికి మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి గెలిపించాలని ఎన్నికల ఇన్‌చార్జి నరేంద్రబాబు అన్నారు. సోమవారం బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కేజీబీవీ మైనార్టీ పాఠశాలలో ఉపాధ్యాయులతో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల ఇబ్బందులు తెలిసిన వారిని గెలిపించుకుంటేనే సమస్యలు త్వరితగతిన పరిష్కారమవుతాయన్నారు. గుర్రం చెన్నకేశవరెడ్డికి ఉపాధ్యాయ సమస్యలపై పూర్తి అవగాహన ఉందన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా గుర్రం చెన్నకేశవరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఎన్నికల అనంతరం సీపీఎస్ రద్దుకు కృషి చేస్తామని, ఏప్రిల్ చివరి వారంలో ప్రమోషన్స్ ,బదిలీలు ఇప్పటించేందుకు పీఆర్‌టీయూటీఎస్ కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో జి.ఎస్.శ్రీధర్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, మల్లేష్, కిరణ్, మంగ్యానాయక్, రాజ్‌కుమార్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వ నమోదు



హైదర్‌గూడలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపడుతున్న టీడీపీ నాయకులు

రాజేంద్రనగర్: తెలుగు దేశం పార్టీకి రాష్ట్రంలో పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి మ్యాడం రామేశ్వర్‌రావు అన్నారు. రాష్ట్ర అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్‌ముదిరాజ్ ఆదేశాల మేరకు సోమవారం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. అత్తాపూర్ డివిజన్ హైదర్‌గూడ ప్రాంతంలో ఇంటింటికి తిరుగుతూ సభ్యత్వ నమోదు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం హయాంలోనే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి చెందిందన్నారు. పేద ప్రజల శ్రేయస్సు కోసం అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలను తీసుకువచ్చిందన్నారు. పార్టీని మళ్లీ అధికారంలోకి తీసుకువచ్చేందుకు ప్రతి నాయకుడు, కార్యకర్త కష్టపడి పని చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు కత్తి దామోదర్ రావు, సోమారం రాజ్‌కుమార్, గూడెపు రాఘవులు, కృష్ణాగౌడ్, బర్ల జంగయ్య, తెడ్ల మధుకర్, ఇటికాల మురళీ, బాల్‌రాజ్, వెంకటేష్, శ్రీశైలం యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సృష్టికి మూలం స్త్రీ





కార్యక్రమంలో పాల్గొన్న ఈటల జమున రాజేందర్, విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు

రాజేంద్రనగర్: సమాజంలో స్త్రీ శక్తి ఎంతో గొప్పదని స్త్రీ లేనిదే సృష్టి లేదని ప్రముఖ పారిశ్రామికవేత్త, జమున హేచరీస్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఈటల జమున రాజేందర్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం రాజేంద్రనగర్ సర్కిల్, ఉప్పర్‌పల్లిలోని సామా భూపాల్ రెడ్డి ఫంక్షన్‌హాల్‌లో జనహిత వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షురాలు కొమిరెడ్డి ఉమామహేశ్వరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళా దినోత్సవ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పురుషులతో సమానంగా స్త్రీలు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. మహిళలు స్వశక్తితో ఎదిగినప్పుడే సమాజంలో గౌరవం దక్కుతుందన్నారు. మహిళా సాధికారిత కోసం అందరూ కృషి చేయాలన్నారు. వంటింటికే పరిమితం కాకుండా వ్యాపార, రాజకీయ, ఉద్యోగాలు, క్రీడల్లో రాణిస్తూ పేరు ప్రఖ్యాతులు సాధించాలన్నారు. ప్రస్తుతం పిల్లలు మితిమీరి ఖర్చు చేస్తున్నారని పొదుపుపై తల్లిదండ్రులు వారికి అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజున మహిళలు సాధించిన విజయాలను గుర్తుచేసుకోవడమేకాకుండా లింగ వివక్ష, అసమానతలను రూపుమాపడానికి, సమ సమాజాన్ని సృష్టించడానికి అందరూ కట్టుబడి ఉండాలని సూచించారు. అనంతరం పలు రంగాల్లో ప్రతిభ కనబరిచిన మహిళలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉస్మానియా యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రాణిరెడ్డి, మాజీ ప్రధానోపాధ్యాయురాలు శ్రీపాద రాధా, ఆదర్శ మహిళ రైతు గౌడ రమాదేవి, సిడిపిఓ లక్ష్మీబాయి, డాక్టర్ సంధ్యామధుసుధన్, అపర్ణరెడ్డి, ఎస్సై శ్వేత, కృష్ణవేణిరెడ్డి, ఎం.వనితా దామోదర్‌రెడ్డి, బుడిగెల రంజిత, వర్కాల రాధిక తదితరులు పాల్గొన్నారు.